క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: కార్తీక బహుళ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. విశేష అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను జరిపారు. దంపతులు పాల్గొని, భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో వ్రత సంకల్పం చేశారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేసి, అక్షితలు అందించారు.

అయ్యప్ప భక్తుల అన్నసమారాధన



అన్నసమారాధనలో భక్తులు

పరవాడ: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ముత్యాలమ్మపాలెం శివారు హనుమాన్‌నగర్‌లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారణ భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు విచ్చేసి, స్వామిని దర్శించుకున్నారు. పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో మణికంఠ శబరి పీఠం, పంచగ్రామాల ప్రజల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

థాంగ్ టాలో అశ్విన్ అనీష్ ప్రతిభ



అశ్విన్ అనీష్‌తో ప్రిన్సిపాల్ వసంతిదేవి

పరవాడ: దీపాంజలినగర్ బాలభారతి పబ్లిక్ స్కూల్ 8వ తరగతి విద్యార్థి అశ్విన్ అనీష్ ఇండియా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్‌ఐ) థాంగ్ టా అండర్-14(56 కేజీ ప్లస్) విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వసంతిదేవి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థితో పాటు కోచ్ తులసీరామ్, పీఈటీ షెల్టన్ జేమ్స్‌లను అభినందించారు. జాతీయ పోటీల్లో కూడా ప్రతిభ కనబరిచి, పతకం సాధించాలని అభిలషించారు.

అప్పన్న అన్నదానానికి విరాళం




దాత అనురాగ్ గుప్తాకు బాండ్ అందిస్తున్న ఏఈవో శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఢిల్లీకి చెందిన అనురాగ్ గుప్తా మంగళవారం రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు అన్నప్రసాద విభాగం ఏఈవో పి.శ్రీనివాసరావు బాండ్‌ని అందించారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఆలయ అధికారులు అందజేశారు.

- శ్మశానాల్లో కనీస సదుపాయాల్లేక ఇబ్బందులు
- నీరు కావాలంటే ఆమడ దూరం వెళ్లాల్సిందే
- చీకట్ల మధ్యే అంతిమ సంస్కారాలు
- పరవాడలో దయనీయంగా శ్మశానవాటికలు

అవస్థల నడుమ ఆఖరి మజిలీ



పరవాడ మండలంలోని పలు శ్మశానవాటికలు దయనీయంగా మారాయి. తమవారు చనిపోయారనే బాధతోపాటు.. అంతిమ సంస్కారానికి కనీస వసతుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి, దగ్గరకు వెళ్లేంత వరకు శ్మశానస్థలిని గుర్తించలేని పరిస్థితి. మండలంలోని వాడచీపురుపల్లి, వెంకటపతిపాలెం, పి.బోనంగి, కలపాక శ్మశాన వాటికల దుస్థితి ఇందుకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు.

పరవాడ:

గ్రామీణ ప్రాంతాల్లోని శ్మశాన వాటికలు అధ్వానంగా మారడంతో అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు పల్లె ప్రాంతాల ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేవు. దహన సంస్కారాలకు పల్లె ప్రాంత ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో పలు శ్మశాన వాటికలకు కనీస రహదారి సౌకర్యం లేదు. కాలి బాటలు తుప్పలు, డొంకలతో నిండి, మృతదేహాలను తరలించేందుకు బంధువులు, శ్మశాన సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. నీటి సరఫరా అంతంత మాత్రమే. దహన సంస్కారాలకు అవసరమైన నీటిని పర్లాంగు దూరం నుంచి తెచ్చుకోవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు చోట్ల శ్మశాన వాటికల్లో ఏర్పాటు చేసిన విశ్రాంతి భవనాలు మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్నాయి. పట్టించుకునే నాథుడు లేడు. ఎండా వానల్లో ఇబ్బందులు పడుతున్నారు.



వాడచీపురుపల్లి శ్మశాన వాటికలో రిపేర్లకు నోచుకోని విశ్రాంతి భవనం

ముళ్లతోవ దాటాల్సిందే..



తుప్పలతో నిండిన వాడచీపురుపల్లి శ్మశాన వాటిక మార్గం

వాడచీపురుపల్లిలో శ్మశాన వాటిక ముఖ ద్వారం తుప్పలు, ముళ్ల చెట్లతో నిండిపోయి రాకపోకలకు వీల్లేనంత దారుణంగా ఉంది. విశ్రాంతి భవనం మరమ్మతులకు గురైంది. విద్యుత్ సౌకర్యం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో రాత్రిపూట దహన సంస్కారాలు చేసేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్మశాన వాటిక వెళ్లేందుకు సీసీ రోడ్డు, చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిలువ నీడేదీ?



కనీస సౌకర్యాలకు నోచుకోని వెంకటపతిపాలెం శ్మశానవాటిక

నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెం శ్మశానవాటికి దుస్థితి కూడా అంతే. వెంకటపతిపాలెంతోపాటు గంగునాయుడుపాలెం, సిమ్మన్న, రాముడుగారి గ్రామాల ప్రజలకు ఇదే దిక్కు. ఇక్కడా కనీస మౌలిక వసతుల్లేవు. అంత్యక్రియల సమయంలో నిలువ నీడ కూడా ఉండదు. ఎండకు చెమటలు చిందిస్తూ, వానలో తడుస్తూ చేయాల్సిన కార్యక్రమాలు ముగించాల్సిందే. కనీసం ఓ షెడ్ నిర్మించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

తుప్పలు పెరిగి..



చుట్టూ పిచ్చి మొక్కలతో అధ్వానంగా పి.బోనంగి శ్మశానవాటిక

పి.బోనంగి శ్మశాన వాటిక పరిస్థితి మరో రకం. ఇక్కడ అవసరమైన నిర్మాణాలు చేపట్టినా, నిర్వహణ లోపం వల్ల సమస్యలు నెలకొన్నాయి. దట్టంగా పెరిగిన తుప్పలు, డొంకలను తొలగించక పోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. విశ్రాంతి భవనాల వద్ద పెరిగిన తుప్పలతో పాములు, విష పురుగుల సంచారం పెరిగింది. దీంతో ఏ సమయంలో ఏ దురదృష్టం వెంటాడుతుందోనన్న భయాందోళనలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలకు ఇబ్బంది



కలపాక శ్మశానవాటికలో తుప్పల మధ్య విశ్రాంతి భవనం

కలపాక శ్మశాన వాటికలో దట్టంగా పెరిగిన తుప్పలు డొంకల మధ్య విశ్రాంతి భవనానికి వెళ్లాలంటేనే స్థానికులు భయపడుతున్నారు. రోడ్డు పక్కనున్న శ్మశాన వాటిక చుట్టూ రక్షణ గోడ లేక దహన సంస్కారాల సమయంలో ఆ మీదుగా రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు భయపడుతున్నారు. శ్మశాన వాటికలో తుప్పల్ని, డొంకల్ని తొలగించి, చుట్టూ ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

ప్రహరీ నిర్మించాలి



వాడచీపురుపల్లి శ్మశాన వాటికలో వీధి దీపాలు లేక రాత్రి సమయంలో దహన సంస్కారాల నిర్వహణ ఇబ్బందిగా ఉంది. చుట్టూ దట్టంగా పెరిగిన తుప్పలు, డొంకలను తొలగించి విషపురుగులు, జంతువుల నుంచి కాపాడాలి. చుట్టూ ప్రహరీ నిర్మించి, విశ్రాంతి భవనానికి మరమ్మతులు చేపట్టాలి. – గెద్దం బాబూరావు, వాడచీపురుపల్లి

మౌలిక వసతుల్లేవు



వెంకటపతిపాలెం శ్మశాన వాటికలో ఎండా వానల నుంచి రక్షణ పొందడానికి విశ్రాంతి భవనం లేదు. మృతదేహాలను దహనం చేయడానికి షెడ్డు లేదు. నీళ్లు కావాలంటే కిలో మీటరు దూరం వెళ్లాల్సిందే. సరైన రహదారి సౌకర్యం లేక ఐదారు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. – పైల అక్కన్న, వెంకటపతిపాలెం

తుప్పలు తొలగించాలి



కలపాక శ్మశాన వాటికలో విశ్రాంతి భవనానికి వెళ్లాలంటే తుప్పల్ని దాటాలి. చీకటి పడితే నిలబడేందుకు చోటు లేక రోడ్డుపైనే కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. దహన సంస్కారాల సమయంలో రోడ్డు మీదుగా రాకపోకలు సాగించేందుకు పిల్లలు, మహిళలు భయపడే పరిస్థితి. రక్షణ గోడ నిర్మిస్తే బాగుంటుంది. – ఇందల రమణ, కలపాక

శంకర్ ఫౌండేషన్ 'విజనరీ ఇన్‌సైట్స్'కు అవార్డు

సింహాచలం: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నడుస్తున్న నెలవారీ వార్తాలేఖ విజనరీ ఇన్‌సైట్స్‌కు పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్‌ఎస్‌ఐ) ద్వితీయ పురస్కారం లభించినట్లు శంకర్ ఫౌండేషన్ డీజీఎం కె.బంగార్రాజు మంగళవారం తెలిపారు. ఈ అవార్డును పీఆర్‌ఎస్‌ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాఠక్, సెక్రటరీ జనరల్ డాక్టర్ పీఎల్‌కె మూర్తి ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో ఈ ఏడాది డిసెంబర్ 20 నుంచి 22 వరకు జరగనున్న 46వ ఆలిండియా పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. నేత్ర వైద్య రంగంలో తాజా పోకడలు, ఆవిష్కరణలు, ఏఐ పాత్రపై ప్రధానంగా దృష్టి సారించి వార్తా లేఖను ప్రచురించడం ద్వారా శంకర్ ఫౌండేషన్‌కు ఈ అవార్డు దక్కిందన్నారు. ఈ సందర్భంగా విజనరీ ఇన్‌సైట్స్ బృందాన్ని, ఎడిటర్ కె.బంగార్రాజును, ట్రస్ట్‌బోర్డు జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్ ప్రత్యేకంగా అభినందించారు.

'త్వరలోనే పంచగ్రామాల భూసమస్యకు పరిష్కారం'



టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న గండి బాబ్జి

పెందుర్తి: సింహాచలం దేవస్థానం పరిధిలో దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్న పంచగ్రామాల భూ సమస్యకు త్వరలోనే మోక్షం లభిస్తుందని పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, రాష్ట్ర నూనె గింజల ఉత్పత్తిదారుల సహకార సంస్థ పర్సన్ ఇన్‌చార్జి గండి బాబ్జి అన్నారు. మంగళవారం జీవీఎంసీ 94వ వార్డు పరిధి పురుషోత్తపురంలో పార్టీ సీనియర్ నాయకుడు చీర అప్పలరాజు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పంచగ్రామాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని వెల్లడించారు. ఇప్పటికే జిల్లా అధికారులతో విజయవాడలో ఈ విషయంపై ప్రత్యేకంగా చర్చించిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలోనే సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కుతుందని స్థానికులకు భరోసా నిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిద్దాం..



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్



పెందుర్తిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల



సింహాచలం ఆర్టీసీ డిపోలో డీఎం, సిబ్బంది

- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



నరవ విశాఖ ఇంజనీరింగ్ కళాశాలలో..



పెందుర్తి శాఖా గ్రంథాలయంలో..



సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



మొగలిపురం సచివాలయంలో సర్పంచ్ గండి అరుణ, గ్రామ పెద్దలు

పెందుర్తి: బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజును పురస్కరించుకుని మంగళవారం నియోజకవర్గంలో 75వ రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- రాంపురంలోని క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అంబేడ్కర్ మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయం అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఉప్పిలి కనకరాజు, కొటాన రాము, రాపర్తి మాధవరావు, జోబ్ దాస్, గొరపల్లి సాంబ, సూర్యనారాయణ, చిరికి దేముడు తదితరులు పాల్గొన్నారు.
- పెందుర్తిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఘన నివాళి అర్పించారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.
- సింహాచలం ఆర్టీసీ డిపోలో ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ జై భీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి సంస్థ డిప్యూటీ సీఎం ఇ.కె.రాజశేఖర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. డిపో కార్యదర్శి కె.గోవిందరావు, ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇ.కోటేశ్వరరావు, యల్లపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.
- నరవలోని విశాఖ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.ప్రదీప్‌వర్మ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు రాజ్యాంగం మీద క్విజ్, ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అకడమిక్ డీన్ డాక్టర్ డి.శాంతారావు, పాలిటెక్నిక్ విభాగం ప్రిన్సిపాల్ పి.ప్రసాద్, ఉమెన్స్ గ్రీవెన్‌సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.దయానా, సిబ్బంది పాల్గొన్నారు.
- స్థానిక శాఖా గ్రంథాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి గ్రంథాలయాధికారి బి.సూర్యకళ పూలమాల వేసి నివాళి అర్పించారు. రాజ్యాంగం గురించి విద్యార్థులకు, పాఠకులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

సబ్బవరం: మండలంలోని విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

- స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించేలా ప్రతి పౌరుడు హక్కులతో పాటు బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గొటివాడ సామ్రాట్ కుమార్ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.
- స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వి.శిరీష అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.
- మొగలిపురం గ్రామ సచివాలయంలో సర్పంచ్ గండి అరుణ రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా నిర్వహించిన ప్రతిజ్ఞలో పాల్గొన్నారు.

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా దీపాంజలినగర్‌లో ఐఎన్‌టీయూసీ–ఎన్‌యూఎంఎస్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి యూనియన్ జనరల్ సెక్రటరీ బి.భీమరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.జె.పి.లెనిన్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భీమరాజు సింహాద్రి ఎన్టీపీసీ కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు



స్వర్ణ తులసీదళాలను భక్తులతో తాకిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో మాంగల్యధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణతులసీ దళార్చనని ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ తులసీ దళాలతో అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ముగిసిన సీనియర్ ఆర్చరీ పోటీలు



సీనియర్ ఆర్చరీ క్రీడాకారులతో నిర్వాహకులు

పరవాడ: పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్లో విశాఖ జిల్లా ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీనియర్ ఆర్చరీ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీలను పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 30 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో రిజర్వ్ కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో ప్రతిభను కనబర్చిన క్రీడాకారులు వచ్చే నెల 3 నుంచి 5 వరకు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారని జిల్లా ఆర్చరీ ప్రధాన కార్యదర్శి కె.నిశాంత్ తెలిపారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైనది వీరే..

రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు బైరాగి నాయుడు, సుధాకర్ నాయుడు, సాయి కృష్ణం నాయుడు, యశ్వంత్ నాయుడు, సాయి మనస్వి, సాహితి, చిన్మయ్‌శ్రీజ, వైష్ణవి, ఆద్య, అరియానా, గణేష్ మణిరత్నం, హర్షవర్ధన్, సాయి కృష్ణంరాజు, గణేష్ నాయక్, సాంబశివ, ప్రశాంత్, హరీష్‌చంద్ర, గౌతమ్ బుద్ధదేవాలు ఎంపికైనట్లు జిల్లా ఆర్చరీ సంఘ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులతోపాటు, పోటీలను సమర్థవంతంగా నిర్వహించిన కోచ్‌లు ఎల్.సూరిబాబు, కె.గోవింద, బి.శివకుమార్‌లను అభినందించారు.

'ఆధార్ సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి'



సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రం

సబ్బవరం: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన విద్యార్థుల విశిష్ట గుర్తింపు సంఖ్య అపార్ రిజిస్ట్రేషన్‌లో ఆధార్ వివరాల మార్పులు, చేర్పుల కోసం నిర్వహిస్తున్న ఆధార్ సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఎంపీడీవో పద్మజ సూచించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అపార్ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు చురుగ్గా నిర్వహిస్తున్నాయన్నారు. అపార్ నమోదులో తప్పులకు తావులేకుండా వ్యక్తిగత వివరాలను సరిదిద్దించుకోవాలన్నారు. విద్యార్థుల అవసరాల నేపథ్యంలో మండలంలో పలు చోట్ల ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తున్నామన్నారు. సమీపంలోని ఆధార్ సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాలల యాజమాన్యాలకు సహకరించాల్సిందిగా కోరారు. ఇప్పటికే మండలంలో 75 శాతం మేరకు అపార్ రిజిస్ట్రేషన్ పూర్తయినట్లు వెల్లడించారు.

వీధిలైట్‌కు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతులు చేసిన వీధి లైట్

పరవాడ: నాయుడుపాలెం కూడలిలో పట్టపగలు వెలుగుతున్న వీధి దీపానికి రిపేర్లు పూర్తి చేసి రాత్రి సమయంలో వెలిగేలా చర్యలు తీసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి త్రినాథ్ తెలిపారు. ఈ నెల 25న 'ఆగితే వెలగవు.. వెలిగితే ఆగవు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. ఇక్కడ కూడలిలో వీధి దీపం ఏర్పాటు చేసిన స్తంభంపై విద్యుత్ తీగలు కలిసిపోవడంతో ఈ సమస్య తలెత్తినట్లు త్రినాథ్ తెలిపారు. సమస్యను గుర్తించి వైర్లను మంగళవారం సరిచేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలో వీధి లైట్ల పర్యవేక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించామన్నారు.